



# వినిపించని రాగాలు

అవధానుల విజయలక్ష్మి

చిన్నారి వేణువులోంచి వెలువడిన నాదం పెద్దదై... ఇంకా పెద్దదై... దిగంతాలను తాకి అక్కడ ముక్కలై... ఆకాశమంతా వ్యాపించింది. తెల్లారుఝామున భూపాళరాగంలో ప్రపంచమంతా స్నానం చేస్తోంది. ఫ్లూటుమీద పరధ్యానంగా కదులుతున్నాయి వేణు వేళ్ళు. కళ్ళు తూర్పున ధగధగా మెరుస్తున్న శుక్రగ్రహాన్ని చూస్తున్నాయి. ఆ వేగుచుక్క కాంతిని కరిగించేయడానికి చూస్తున్నాయి బంగారు రంగు సూర్యుడి కిరణాలు.

రోజూ అనుకొంటాడు వేణు ఈ క్షణం ఇలా ఉండిపోతే బాగుండునని! కాని గడియారంలో ముళ్ళు ఆగిపోవు... సూర్యుడు ఉదయించక మానడు...వేగుచుక్క మాయమవక మానదు. పాల వ్యాను భీకరంగా గర్జించుతూ రాకమానదు.

'భోంయి' మన్న పెద్ద శబ్దంతో ఉలిక్కిపడ్డాడు వేణు. వీధివీధంతనూ నిద్రలోంచి లేపేస్తూ పెద్ద శబ్దంతో వీధిచివరకొళ్ళి ఆగింది పాలవ్యాను. పూలపాన్పుమీంచి రాతినేలమీదికి

పడేసినట్లయింది. వీధంతా కోలాహలం... హడావిడి మొదలు...రొటీన్ జీవితం మొదలు... బండిచక్రం తిరగడం మొదలు. మెషీన్‌లో ఇరుసు తిరగడం మొదలు... మనుష్యుల మనస్సులో కోరికలు నిద్రలేవడం మొదలు... వీధరుగుమీంచి ఒక్క గెంతు గెంతి ఇంట్లోకి నడిచాడు వేణు. పెరట్లో ఎక్కడో అమ్మ నూతి లోంచి నీళ్ళు తోడుతున్న చప్పుడు... ఇంకా నిద్ర లేవని తమ్ముళ్ళమీదా చెల్లెళ్ళమీద తిట్లవర్షంతో మేల్కొలుపు !

''ఒక్కొక్కరూ దున్నపోతుల్లా పొద్దుపోయే దాక మంచం దిగకపోతే ఎలాగర్రా ? ఒక్కదాన్నే పన్నతో ఎంతకని ఛావనూ !మళ్ళా ఒక్కొక్కరికీ టైముకి అన్నీ అమర్చిపెట్టాలి. .''

రోజూ అలవాటయిన మాటలే అయినా ఎందుకో మనసు చివుక్కుమంటుంది.

వంటింట్లో మూలనున్న సీసాలూ, గూట్లోఉన్న డబ్బులూ తీసుకొని భారంగా బయటకు నడిచాడు

వీధివాకిట్లో పెద్దచెల్లి అప్పుడే ముగించిన ముగ్గుని నాల్గువైపుల్నించి పరికించి చూస్తోంది.

పాలసీసాల్తో బయటకు నడవబోయిన వేణు చప్పున ఏదో గుర్తొచ్చినట్లు ఆగిపోయాడు.

''ఏమ్మా రాధా...ఇంటర్ ఫస్ట్‌క్లాసులో పాసయ్యావు కదా ! ఏం చదువుదామనుకొంటు న్నావు ?''

''నాన్న కాలేజిలో జాయిన్ చేసినప్పటి సంగతి కదన్నయ్యా'' అంది నిర్లిప్తంగా ముగ్గు కేసి చూస్తూ.

''బియ్యే లిటరేచర్ చదవకూడదూ ?... లేకపోతే సంగీతంలో డిగ్రీ చెయ్యకూడదూ ?'' ఆసక్తిగా అడిగాడు.

అదోలా నవ్వింది రాధ.

''ఎందుకన్నయ్యా బియ్యే లిటరేచర్లూ... సంగీతాలూనూ ? గుమాస్తా ఉద్యోగాలుకూడా రావు. టైపూ, షార్టుహేండులో జాయి నయ్యానుగా అవి నేర్చుకొంటూనే ప్రైవేటుగా బీ ంకి కట్టేద్దామని చూస్తున్నాను. మూడేళ్ళు మెల్లిగా కష్టపడితే ఏ బ్యాంకులోనో ఉద్యోగం సంపాదించేసుకోవచ్చు అప్పుడింక నాన్న రోజూ నా పెళ్ళి గురించి బాధపడిపోనక్కర్లేదు ఏమంటావన్నయ్యా ?''

వేణు మనస్సంతా చేదుమందు తిన్నట్లయింది

''ఇంత వ్యాపార దృష్టితో ఆలోచించడం ఎప్పుడు నేర్చుకున్నావమ్మా ? నీ భావుకత్వం . నీ తియ్యటి గొంతూ అన్నీ వేస్టేనా ?''

ఫక్కుమని నవ్వింది రాధ

''మన బతుకులే వేస్టు ! ఇంక గొంతుల దాకా ఎందుకన్నయ్యా !'' అంటూనే ఇంట్లోకి తుర్రుమంది.

వీపున ఛెళ్ళున చరిచినట్లయింది వేణుకి.

''ఇంత పిల్లకి అప్పుడే ఎన్నిమాటలు !'' ఆశ్చర్యపోయాడు వేణు. భారంగా వీధిలోకి నడిచాడు

అప్పటికే చాలమంది క్యూలో నిల్చొన్నారు. ఇంకా చాలమంది పాలెక్కడ అయిపోతాయేమో నని ఉరుకులూ, పరుగులూ పెడుతున్నారు.

ఉరుకులు ... పరుగులు .. వ్యాపారం . లాభం ... నష్టం ... స్వార్థం .. ఈ రోజుని రొటీన్‌గా గడిపేసుకోవాలన్న తాపత్రయం ..

ఈ మనుష్యుల హృదయాల్లో రాగంలేదు. ఉన్నది కేవలం ఒక యంత్రం ... ఒక రూపాయి నోటు. ఒక కోరిక ... ఒక అసంతృప్తి వీచిక.. అంతే! క్యూలో ఆఖరివాడు వేణు. సాధారణంగా రోజూ ఆఖరివాడుగానే ఉంటాడు. ఆఖరి వాడైనా అదృష్టంకొద్దీ ఆ రోజు పాలు దొరికాయి. లేకపోతే అమ్మచేత మళ్ళా చివాట్లు. అవతల వీధి గేదెలవాడి దగ్గరికి పరుగు --

పాలు తెచ్చి వంటింట్లో పెట్టేసరికి అమ్మ కర్రల పొయ్యితో కుస్తీపడుతోంది. తడిసిన కర్రలతో వంటిల్లంతా పొగ ... అమ్మ కళ్ళలో ఎరుపు జీరలు.

''ఏమండోయ్ ... ఇదిగో మిమ్మల్నే ... నిద్రలేస్తారా ? అయిదున్నరవుతోంది. మళ్ళా ఆరుగంటలకల్లా ట్యూషన్‌కి పోవాలాయె ... ఏమిటో ఖర్మ ఇన్ని తడి కర్రముక్కలు తెచ్చి నా నెత్తిన పడేస్తారు. ఈ పొయ్యి అంటించడంతోనే నా బతుకు తెల్లవారే టట్లుంది. గాస్‌స్టవ్‌లూ, ప్రెషర్ కుక్కర్లూ కొనుక్కొనే భాగ్యం మన కెలాగూ లేదు. ఒక కిరసనాయిల్ స్టవ్వయినా వాడుకొనే రాత నా మొహాన్న లేదు .'' అమ్మ గొంతులో కర్కశత్వం.. రోషం... నిస్సహాయత్వం.

''తడి కర్రలు తెచ్చి నీ నెత్తిన పడేయడం నాకు మాత్రం సరదాటే ? నీ ఖర్మకొద్దీ బడి పంతుల్ని కట్టుకున్నావ్. . నాలుగుట్యూషన్లతో, పగలల్లా స్కూల్లో చాకిరీతో నీకు గాస్‌పొయ్యిలే కొనిపెట్టనా ? ప్రెషర్‌కుక్కర్లే కొనిపెట్టనా? హాయిగా ఏ ఆఫీసర్నో కట్టుకోలేకపోయావా ? కాలుమీద కాలేసుకు కూర్చొనే దానివి కదా ?''

నాన్న గొంతులో కోపం, దైన్యం, అలసట.

''పెళ్ళయి ఇరవైఏళ్ళు దాటుతుంటే ఇప్పుడా విసుర్లన్నీ ఎందుకూ... ఖర్మ... నా రాతింతే !''

అమ్మకంట్లో నీరు .పొగవల్లో . దుఃఖం వల్లో ...

చేతిలో పళ్ళపొడి వేసుకొని నూతిగట్టు దగ్గరికి నడిచాడు వేణు. మామిడిచెట్టు మీద కాకులన్నీ కోలాహలంగా ఎగురుతున్నాయి. జామ చెట్టుమీద పిచుకలు కిచకిచలాడుతున్నాయి. . తానో పిచ్చికో, కాకో అయితే ?

ఊహూ అవదు... మనిషిగానే పుట్టాడు. మనిషిగానే పెరుగుతున్నా మనిషిగానే ఛస్తాడు.

అప్పుడే విచ్చుకొంటున్న వెలుగురేఖల్లో పాతబడిన పెంకులు ఇంకా నల్లగా కనిపి స్తున్నాయి. మధ్య తరగతి బతుక్కి ప్రతి బింబంలాగుంది ఆ పాతకాలంనాటి పెంకుటిల్లు.

ఆ పాత పెంకుటిల్లు కూడా లేకపోతే ఈ మహాపట్నంలో... ఇరుకు సందుల్లో... మురి క్కాలువల పక్క చీకటి గదుల్లో... నో ఊహించలేదు.

''ఒరేయ్ వేణూ తొందరగా వచ్చి కాఫీ తీసుకో.. చల్లారిపోతే మళ్ళా వేడిచెయ్యలేను... సంగీతమో అంటూ ఆ కర్రముక్కని గంటల తరబడి పట్టుకు కూర్చోకపోతే క్లాస్సేపు చదువుకో కూడదూ ! ఆ బీకాం గట్టెక్కేదెప్పుడో .. నీకు ఉద్యోగం దొరికేదెప్పుడో ఆ దేముడికే తెలియాలి'' అమ్మ గొంతు వంటింట్లోంచి ఖంగుమంది. మౌనంగా వెళ్ళి కాఫీగ్లాసు అందుకొని మళ్ళా పెరట్లోకొచ్చి నూతిగట్టుమీద కూర్చున్నాడు.

అమ్మ నోట్లోంచి మృదువైన మాటలు విని ఎన్నాళ్ళు... ఊహూ ఎన్నేళ్ళయింది !

అప్పుడెప్పుడో చిన్నప్పుడు... ఎన్నో యుగాల క్రిందట..

''కాఫీ తీసుకోరా వేణుబాబూ'' అని అమ్మ మృదువుగా, ఆప్యాయంగా, తియ్యగా పిలిచేది

అమ్మ పిలుపులోనే ఒక సంగీతం ఉండేది.

ప్రశాంతంగా పన్లు చేసుకొంటున్నప్పుడు నిండు చేతుల గాజుల గల గలల్లో.. తన చెయ్యి పట్టుకొని... చెల్లిని చంకలో పెట్టుకొని నడుస్తున్న కాలిమట్టెల మోతలో ...

తమ్ముడికి పాలిస్తూ తీసే సన్నని కూని రాగాల్లో

అన్నిట్లోనూ సంగీతమే.

పన్లతో అస్తమానం పగిలిపోతున్నాయి, బోల్డు ఖర్చని అమ్మ చేతినిండుగా గాజులు వేసుకోడం మానేసి రెండేసి రబ్బరు గాజులు ఎప్పటినుంచి వేసుకొంటోందో గుర్తులేదు.

కాలి మట్టెలు కరిగిపోయి ఎప్పుడు రూపాయినోట్లుగా మారాయో గుర్తులేదు.

అమ్మ గొంతులో కూనిరాగాలు ఆగిపోయి నిష్ఠూరాలు ఎప్పుడు చోటు చేసుకొన్నాయో గుర్తులేదు.

కాని ఇవన్నీ ఒక్క క్షణంలో జరిగినవికావు ! కాలచక్రం బరువు కింద క్రమక్రమంగా నలగగా ఏర్పడ్డ ఫలితాలు !

కనీసపు ఆనందాల్ని కూడా రూపాయల్తో కొల్చుకొనే స్థితికి దిగజార్చిన పరిస్థితులు !

కాఫీ తాగడం అయిపోయింది.

''అమ్మా గోపీ వాళ్ళింటికి వెళ్తున్నా''

''ఒరేయ్ కంబైన్డ్ స్టడీ అంటూ ఆ గోపీగాడింటికి షికారిగెత్తకపోతే ఆ చదువేదో ఇక్కడే చదువుకోకూడదూ ? అక్కడికెళ్ళి చదువే వెలగబెడుతున్నావో ? పోచికోలు కబుర్లు

వెనుకు కూర్చుంటున్నావో ?'' గదిలోంచి నాన్న గొంతు భారంగా వినిపించింది.

''పరీక్షలయ్యాక మీకే తెలుస్తుంది నాన్నా'' అంటూనే గబగబా వీధిలోకి నడిచాడు.

నిజం తెలిసిననాడు నాన్న ఏమంటాడు ?

కంబైన్డ్ స్టడీ పేరుతో తనూ, గోపీ సంవత్సరం నించి చేస్తున్న పని తెలిసిననాడు ?

కోపంతో చిందులు వేస్తాడా ? దుఃఖంతో కన్నీళ్ళు పెట్టుకొంటాడా ? ఆనందంతో కౌగలించుకొంటాడా ?

వేణు అడుగులు గబగబా పడ్డాయి. కనీసం ఆరు గంటలకైనా ప్రెస్సులో ఉండాలి !

గోపీ ఇంటిముందు ఆగాడు. అప్పటికే గోపీ బయల్దేరడానికి సిద్ధంగా ఉన్నాడు.

''హాయ్ గుడ్‌మార్నింగ్'' గోపీ హుషారుగా అన్నాడు

''వెరీ గుడ్ మార్నింగ్'' వేణు చెయ్యి కలిపాడు.

''లాస్ట్ డే ఫర్ ది ప్రైవేట్ జాబ్'' గోపీ వేణుతోబాటు నడుస్తూ అన్నాడు.

''లాస్ట్ డే ఫర్ ది రొటీన్ లైఫ్'' వేణు అలసటగా అన్నాడు

''సంవత్సరం ఎంత త్వరగా గడిచిపోయిందో చూశావా ?''

''అవును మరి అనుకొన్నది చేతికందుతుంటే అలాగే ఉంటుంది'' ఎన్నో మలుపులు తిరిగి ఇద్దరూ ఆ చిన్న ప్రింటింగ్ ప్రెస్‌లోకి ప్రవేశించారు.

భోరుమని పని చేస్తున్న మెషిన్‌ముందు కూర్చున్న వేణు చేతులు యాంత్రికంగా తన పనులు చేసుకుపోతున్నాయి.

ఆలోచనలు మాత్రం ఎక్కడెక్కడో పరిగెడుతున్నాయి

రేపీ టైముకి ఏం చేస్తూ ఉంటాడు ?

రొదపెడుతున్న ఈ యంత్రం ముందు మాత్రం ఉండడు !

పెరట్లో ప్రశాంతంగా చెట్టుకింద కూర్చొని.. ఏ వేణునాదంలోనో, వీణానాదంలోనో మునిగి తేలుతూ ...

అది ఏ నాదమైనా ఫర్వాలేదు.

ఈ నిట్టూర్పుల ,మధ్యనించీ, నిరాశల మధ్యనించీ,...ఈ కృత్రిమమైన ప్రపంచం మధ్యనించి తనను తీసి బయటపడేయ గల్గితే చాలు ! ఆ కొన్ని గడియలైనా డబ్బుతో కొనుక్కోలేని అనుభూతి మనస్సుని తాకితేచాలు.

ఈ పార్ట్‌టైం జాబ్‌కి నెలకి ఎనభై చొప్పున పన్నెండు నెలలకు తొమ్మిది వందల అరవై రూపాయిలూ...ఇన్నాళ్ళూ ఆ జీతాన్ని యజమాని దగ్గరే దాచుకొన్నందుకు వడ్డీ నలభై రూపాయిలూ మొత్తం వెయ్యి రూపాయలవుతాయి ! ఈ రోజుతో కాంట్రాక్టు పూర్తయింది ! సంవత్సరంబాటు కాపాడుకొన్న

# వినిపించని రాగాలు

రహస్యం రేపటితో బద్దలవుతుంది. ఏడాదిబాటు తాను అలసటనీ, చదువునీ ఆలోచన్లనీ పణంగా పెట్టి సంపాదించిన వెయ్యిరూపాయలు చేతికొస్తాయి. తాను కలలో మాత్రమే చూడగలననుకొన్న వస్తువు రేపు తన చేతి కొస్తుంది.

రికార్డ్ ప్లేయర్ ? కావలసిన రికార్డులన్నిటితోసహా !

సరిగ్గా సంవత్సరం క్రితం గోపీ ఈ అయిడియా చెప్పకపోతే తన కల కలగానే మిగిలిపోను. థాంక్యూ గోపీ... థాంక్యూ !

రేపట్నించి...

మనస్సు అలిసిపోయినప్పుడు భానుమతి తియ్యని గొంతులో... మనస్సుపరవశించినప్పుడు, ఘంటసాల కమ్మని గానంలో... ఒంటరితనం మనస్సుని దొలిచినప్పుడు, సైగల్ గొంతు విషాదపు పొరల్లో . మనస్సంతా మొద్దుబారి శూన్యంగా ఉన్నప్పుడు, బిస్మిల్లాఖాన్ శహనాయ్‌లో ... ఆ సంగీతంలోనే తాను మళ్ళా అమ్మ లాలన పొందగలడు !

ఆ సంగీతంలోనే తాను మళ్ళా కల్మషం లేని చిన్ననాటి చెలిమి రుచిచూడగలడు !

ఆ సంగీతంలోనే తాను కన్నీటిని తుడిచే చేతి స్పర్శని పొందగలడు ? సూర్యుడి కిరణాలు చురుక్కుమంటున్నప్పుడు వేణు ఇంట్లో కడుగు పెట్టాడు ఆనందంలో తేలిపోతూ !

జేబులో ఉన్న వెయ్యి రూపాయల చెక్కూ చేతికి ఎంతో మృదువుగా తగులుతోంది !

ఇంట్లో కడుగుపెట్టబోయేసరికి నాన్న గుమ్మం దిగుతున్నాడు.

''స్కూలుకేనా నాన్నా సైకిలేసుకెళ్ళకూడదూ ?'' జాలిగా చూస్తూ అడిగాడు.

''అక్కర్లేదులేరా... నడవడానికే కాళ్ళు అలవాటు పడిపోయాయి. ఆ వెధవ సైకిలు ఏ క్షణంలో పంక్చరవుతుందో తెలియదు. ఏ క్షణంలో చైను ఊడుతుందో తెలియదు. ఏదో ఒక రోజు అమ్మేస్తే ఆ నాలుగు డబ్బులూ మరే అవసరానికైనా పనికొస్తాయి.'' భారంగా నడిచి వెళ్ళిపోతున్న నాన్నవైపు దీనంగా చూశాడు. చక్కని సంగీతంలో ఎక్కడో చిన్న అపశ్రుతి !

> **'ట్రీ' పార్టీ**
>
> ఎలక్షన్ 'సీజన్'లో
> పార్టీ 'ట్రీ' తొడిగిన
> వాగ్దానాల చిగుళ్లు
> పూలై వికసించినప్పుడే
> ప్రజలకి
> ఫలం దక్కినట్టు !!!
>
> — రామసూరి

ఇంట్లోకడుగు పెడుతూనే అమ్మగొంతు గట్టిగా వినిపిస్తోంది. చెల్లిమీద కేకలు !

''ఒసే ఆడపిల్లవి . . టైపూ షార్టుహేండంటూ వీధిలోకి పరిగెడితే ఎలాగే ? ఎన్ని పనులకి నేనొక్కర్తెనూ చావనూ ! ఏడున్నర లోపున కాఫీలూ, వంటలూ, స్నానాలూ... ఒక్కర్తెనూ ఎంతకని చేసుకోనే ? ఇవాళ మీ నాన్న కూరలేకుండా ఉత్త మజ్జిగ అన్నమే తిని వెళ్ళారు. మళ్ళా సాయంత్రం అయిదు దాకా రారాయె !''

''ఏం చెయ్యనమ్మా . ఆ టైప్ ఇన్‌స్టిట్యూట్‌వాడు ఎంత బతిమాలినా పొద్దున్న తప్పమరెప్పుడూ ఖాళీలేదని చెప్పేశాడు పోన్లేమ్మా. అయిదారు నెలలే ఆ తర్వాత నీకేం బాధుండదు''

''ఏమిటోనే తల్లీ. . ఆ వేణుగాడిమీదే ఆశలన్నీ పెట్టుకొన్నాను. వాడ కాస్త చేతికి అందొస్తే కాస్త భారం తగ్గుతుంది. వీడేమో ఎప్పుడూ పుస్తకం పట్టుకొన్నట్లే కనిపించడు. ఎప్పుడు పాసవుతాడో ఎప్పుడు ఉద్యోగం వస్తుందో !'' అమ్మ గొంతు నీరసంగా వినిపించింది

''అన్నయ్య గురించి నువ్వెందుకు బెంగపెట్టుకుంటావమ్మా ! అన్నయ్యెప్పుడైనా ఫేలయ్యాడా ? అయినా నేను మరో ఏడెనిమిది నెలల్లో టైపింగ్ లోయరు పాసయిపోతానుగా ! ఎక్కడైనా చిన్న ఉద్యోగం సంపాదించేసుకొంటే కొన్ని వస్తువులు మెల్లమెల్లగా కొనుక్కోవచ్చు. నాన్నగారికో సైకిలూ, నీకో ప్రెషర్‌కుక్కరూ, గాస్‌స్టవ్వూ. ఇవన్నీ మెల్లమెల్లగా కొనేసుకుంటే కొన్ని బాధలు తగ్గుతాయి'' చెల్లి గొంతులో ఆశ తళుక్కుమంది.

స్వేచ్ఛగా ఆకాశంలో ఎగురుతున్న గాలిపటం దారం తెంపేసినట్లయింది ! నీరసంగా అరుగుమీదే కూలబడిపోయాడు.

''ఏమిటోనే తల్లీ ఆఖరికి ఆడపిల్ల సంపాదనే తినవలసి వచ్చేట్లుంది'' లోపల్నించి అమ్మ మాటలు నీరసంగా వినిపించాయి.

మనస్సులో ముల్లు గుచ్చుకొన్నట్లయింది. జేబులో చెక్కు మోయరానంత బరువుగా అనిపిస్తోంది.

ఏదో పనిమీద బయటికొచ్చిన అమ్మ —

''నువ్వెప్పుడొచ్చావురా ? , ఇవాళ కాలేజీ లేదేమిటి ? అక్కడే కూర్చుండిపోయావు ?'' ఆశ్చర్యంగా అడిగింది.

''ఇవాళ సెలవమ్మా .. రేపు ఉగాదికదా ! రెండురోజులు సెలవిచ్చేశారు'' అప్రయత్నంగా అబద్ధమాడేశాడు.

అమ్మ లోపలికెళ్ళిపోయింది. వేణు అరుగుమీదే కూర్చున్నాడు.

సాయంత్రం దాక అలా కూర్చొనే ఉన్నాడు ...

సాయంత్రం నాలుగయింది.

అనుకొన్న ప్రోగ్రాం ప్రకారం ఈ టైమ్‌కి బజార్లో ఉండాలి ! నిన్ననే షాపువాడికి ఆర్డరిచ్చేశాడు ఏయే రికార్డులు కావాలో.

రేపు ఉగాదినాడు తెల్లవారుతూనే అందర్నీ ఆశ్చర్యపరచాలి ! బిస్మిల్లాఖాన్ సన్నాయితో ఇంట్లో అందరికీ మేల్కొపులు పాడాలి ! అందరూ ఆశ్చర్యానందాలతో లేచి ఉక్కిరి బిక్కిరవుతుండగా అసలు రహస్యం అందరికీ చెప్పేయాలి. ఈ ఏడాదిపాటు తాను పడ్డ శ్రమ ... కన్న కలలూ ... అన్నీనూ.

ఆ తర్వాత ఇంటిల్లిపాదీ లేచి పన్లు చేసుకొంటున్నప్పుడు ఘంటసాల భక్తి గీతాలు.

అందరూ భోజనాలు చేసి మధ్యాహ్నం నడుములు వాల్చినప్పుడు ఈమని శంకరశాస్త్రి వీణ.

ఇవి ఎన్నాళ్ళనించో తనుకన్న రంగుల కలలు!

కాని ఆ రంగులన్నీ ఇప్పుడు కరిగిపోతున్నట్లు అనిపిస్తున్నాయి !

గాలిలో తేలిపోయే సన్నాయి వాద్యపు మాధుర్యాన్ని అమ్మ గొంతులోని నిష్ఠూరత్వం మింగేస్తుందేమో ?

నాన్న గొంతులోని నీరసంతో ఘంటసాల గొంతులోని గంభీరత్వం కరిగిపోతుందేమో !

చెల్లెలు గొంతులోని చేదు భానుమతి గొంతులోని తియ్యదనాన్ని విరిచేస్తుందేమో ? దరిద్రదేవత చేసే వికటాట్టహాసం ముందు .. సరస్వతీదేవి సంగీతం వినపడదేమో ?

అవును ! కడుపు నిండినచోట వేణువు ! కడుపు నిండనిచోట అదో కర్రముక్క !

ఏదో నిశ్చయానికొచ్చినట్లు లేచి వేణు అరుగు దిగాడు.

అవును ! ఉగాదినాడు పొద్దున్నే అందర్నీ ఆశ్చర్యపరుస్తాడు... తప్పదు !

''అమ్మా ! నేను గోపీ ఇంటికెళ్తున్నాను... రాత్రి ఇంటికి రాను... రాత్రంతా అక్కడే చదువుకొంటాను. రేపు తెల్లారురూమునే వస్తాను.''

అతని కాళ్ళు ఉత్సాహంగా బజారువైపు నడిచాయి.

* * *

ఉగాదినాడు ఉదయాన్నే సైకిల్ బెల్లు టింగ్ టింగ్ మనిపించాడు ఇంటిముందు. వేణు.

అమ్మొచ్చి తలుపు తీసింది.

''అమ్మోయ్... అమ్మా... తొందరగా వెళ్ళి ఇంట్లో అందర్నీ లేపు... మీ కందరికీ ఒక ఆశ్చర్యం.''

అమ్మ లేపనవసరంలేకుండానే ఇంటిల్లిపాదీ వచ్చేరు.

''నాన్నా చూశారా ఈ కొత్త సైకిలు ? బాగుందా ? ఇది మీకు అయిదు వందలయింది. అమ్మా ఇది ప్రెషర్ కుక్కరు, ఇది నూతన్ స్టవ్వు ఈ రెండూ నీకు...ఇదిగో ఈ పాకెట్‌లో ఉన్న పుస్తకాలన్నీ తమ్ముళ్ళకీ చెల్లాయిలకి. టెక్స్టు పుస్తకాల్లేక రోజూ వీళ్ళనీ, వాళ్ళనీ అడిగి ఇబ్బంది పడుతున్నారు కదా ! రాధీ... ఈ గాజుల ప్యాకెట్టు తీసికో. ఇకనించి నువ్వూ, అమ్మా చేతినిండా గాజు లేసుకోవాలి ...'' గడగడా చెప్పేశాడు వేణు.

అందరూ ఆశ్చర్యపోయి చూస్తుండగా అప్పుడు చెప్పేశాడు తను సంవత్సరంనించి చేస్తున్న పని !

* * *

ఆ రోజు...

తెల్లవారు ఝామునే తమ్ముళ్ళు సంబరంగా కొడుతున్న సైకిలు గంటల మోతలో...

మధ్యాహ్నం త్వరగా పనులన్నీ ముగించుకొన్న అమ్మ వత్తులు చేసుకొంటూ తీస్తున్న కూనిరాగాల్లో...

సాయంత్రం పక్కింటి స్నేహితురాల్తో అన్న గురించి గర్వంగా చెపుతూ చెల్లెలు నవ్వుతున్న కిలకిల నవ్వుల్లో...

రాత్రి అట్టే అలిసిపోని నాన్న నిశ్చింతగ కూర్చొని చదువుకొంటున్న భగవద్గీత శ్లోకాల్లో... అన్నిటిల్లోనూ సంగీతమే !

ఆ వినిపించని రాగాల్లో తన్మయుడవుతూ... ఎప్పుడో వినిపించబోయే నిజమైన రాగాల గురించి కలలుకంటూ నిద్రలోకొరిగాడు వేణు. ★


